క్లుప్తంగా

115 మందికి కంటి వైద్య పరీక్షలు



మల్లవరంలో నేత్ర వైద్యశిబిరంలో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు, వైద్య సిబ్బంది

చాగల్లు: మల్లవరంలో శివజ్యోతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల సిబ్బంది 115 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ కేకేఎస్ హైమావతి, సభ్యులు కేవీ రాజు, డాక్టర్ కె.ఆదిత్య విశ్వాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిడదవోలు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని ఆమె కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: యర్నగూడెం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ యర్నగూడెం ఎస్ఎస్ హెచ్‌క్యూ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు. ఫీడర్‌పై ఉన్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. దేవరపల్లి సెక్షన్ పరిధిలోని బుచ్చియపాలెం, అచ్చియపాలెంలో సోమవారం ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం 33/11 కేవీ రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

మానవత సేవలు విస్తృతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: మానవతా సేవలను మరింతగా విస్తృతం చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. పట్టణంలోని టౌన్ హాలులో ఆదివారం నిర్వహించిన మానవత సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, కార్యదర్శి హైదర్ భాషా, కోశాధికారి ముళ్లపూడి సోమరాజు, సంయుక్త కార్యదర్శి పీవీఎస్ సుబ్బారావుతో పాటు సభ్యులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు దారపురెడ్డి సూర్యచంద్రరావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మానవత జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, కండెపు సూర్యనారాయణగారు, ఉన్నమట్ల లీలాలక్ష్మీ పాల్గొన్నారు.

త్వరలో ధాన్యం సొమ్ము జమ

ఉండ్రాజవరం: ధాన్యానికి సంబంధించిన సొమ్ము త్వరలోనే జమ చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉండ్రాజవరంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామంలో నెలకొన్న తాగునీరు, వితంతు పింఛన్లు, పిండ ప్రదానాలు చేసేందుకు అవసరమైన స్థలం, ధాన్యం సేకరణ సొమ్ము, వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటు తదితర సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తానని దుర్గేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు
- కొవ్వూరులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' సభ



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న చెల్లుబోయిన వేణు

తాళ్లపూడి(కొవ్వూరు): మూడు పార్టీలు కూటమి పేరుతో జత కట్టి ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా రాష్ట్రంలో ఎక్కడ చూసినా దోపిడీ, అవినీతి అరచక పాలన సాగుతోందని, వైఎస్సార్ సీపీ శ్రేణులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కొవ్వూరులోని లిటరరీ క్లబ్ వద్ద బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ నియోజకవర్గస్థాయి సమావేశం ఆదివారం వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు గొందే శ్రీనివాసరెడ్డి పాల్గొని బాబు ష్యూరిటీ.... మోసం గ్యారంటీ బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎల్ఈడీలో చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌లో భాగంగా చంద్రబాబు హామీ ఇచ్చిన ఒక్క పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది తల్లులు ఉంటే కేవలం 30 లక్షల మంది తల్లులకు మాత్రమే తల్లికి వందనం పథకం అమలు చేశారని తెలిపారు. వలంటీర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోంచి తొలగించి అన్యాయం చేశారని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలను కలిసి చంద్రబాబు మోసాలు వివరిస్తామని తలారి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవినీతి, దోపిడీ, అరాచకాలను బాధ్యత గల ప్రతిపక్షంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ పట్ల నిబద్ధ, నిజాయతీతో పని చేసినవారికి గుర్తింపు తప్పక ఉంటుందని ఆయన అన్నారు.

రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం

జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో దోపిడీ ప్రభుత్వంగా మారిందని తెలిపారు. ఏడాది కాలంలో చంద్రబాబు లక్షా అరవై కోట్లు అప్పు చేసారని అన్నారు. గతేడాది తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగభృతి, మహిళలకు పథకాలు, ఉచిత గ్యాస్ ఇలా ఏవీ అమలు చేయకుండా తాత్సారం చేయడం ప్రజలను మోసం చేయడం కాదా అని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు తీర్చడం లేదన్నారు. ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని అన్నారు.

కూటమి నేతలకు ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారు

రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు మొత్తం అమలు చేశామని కూటమి నేతలు ప్రకటిస్తున్నారని వారికి ప్రజలు తప్పకుండా బుద్ధిచెబుతారని అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గొందే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి అందరూ కలసికట్టుగా తీసుకుని వెళ్లి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీలు జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరస్వామి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంతమని రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి అబ్బులు, మాజీ ఎమెల్సీ కోడూరి శివరామకృష్ణ, కొవ్వూరు టౌన్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, తాళ్లపూడి, చాగల్లు మండలాల కన్వీనర్లు కొలిశెట్టి నాగేశ్వరావు, మట్టా వెంకట్రావు, పరిమి సోమరాజు, కంతమని రమేష్, పరిమి సోమరాజు, సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, ముప్పిడి దమయంతి, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరావు, వంబోలు పోసిబాబు, కవల నాగేశ్వరావు, బీవీఎస్ చౌదరి, దేవగుప్తాపు చాందిని, అంకోలు లిల్లి, నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ సీపీలో చేరికలు



దేవినేనివారిగూడెంలో మాజీ మంత్రి తానేటి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలు

దేవరపల్లి: ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగూడెంలో టీడీపీ నుంచి 10 మంది కార్యకర్తలు, 20 మంది కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లు ఆదివారం మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. మాజీ మంత్రి వనిత వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రతాపనేని వాసుబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బొండా వెంకన్నబాబు, జిల్లా నాయకులు గుర్రాల లక్ష్మణ్, చిలకా సతీష్, దాసరి ఏసురత్నం, భీమేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, నల్లజర్ల మండల పార్టీ అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



జగనన్న కాలనీలో బురద రోడ్డుపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు: నిర్లక్ష్యానికి గురవుతున్న జగనన్న కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ జగనన్న కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ జగనన్న కాలనీలో నివాసముంటున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపాలిటీ విఫలమైందని విమర్శించారు. జగనన్న కాలనీ కొద్దిపాటి వర్షానికి మట్టి రోడ్లు బురదమయమై జనం జారిపడిపోతున్నారన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవ, కోట సత్యనారాయణ, కారింకి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి ఆదివారం 5,500 క్యూసెక్కుల గోదావరి జలాలను తగ్గించి కాలువలకు విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఉప కాలువలకు నీటి విడుదలను అధికారులు తగ్గించారు. నరసాపురం కాలువకు 1,912 క్యూసెక్కులు, తణుకు కాలువకు 606, ఏలూరు కాలువకు 888, ఉండి కాలువకు 1,087 అత్తిలి కాలువకు 402 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.



నిడదవోలు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

గ్రామాల్లో మెగా వైద్య శిబిరాలు



తాళ్లపూడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వేద స్పైన్, గైనిక్ హాస్పిటల్ వైద్యులు



వేగేశ్వరపురంలో వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

తాళ్లపూడి: గ్రామాల్లోని పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందజేయడం హర్షణీయమని గోవూరు రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు తెలిపారు. తాళ్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద రాజమహేంద్రవరంలోని వేద హాస్పిటల్ స్పైన్, గైనిక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ పి.తేజో ఫణీంద్ర, స్త్రీల వైద్య నిపుణురాలు లక్ష్మి మృదుల ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడనొప్పి, డిస్క్ సమస్యలు, ఆర్థరైటిస్, మహిళల సమస్యలపై రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఎముక సాంద్రత తెలుసుకునే బీఎండీ పరీక్షతో పాటు ఇతర పరీక్షలు, మందులు 100 మందికి ఉచితంగా అందజేసారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, పీఆర్వో నవీన్ పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో వైద్య శిబిరం

తాళ్లపూడి: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు సాయి స్ఫూర్తి హాస్పిటల్ సీఈవో గూడా విజయరాజు తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తాళ్లపూడిలోని సాయి స్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు వర్మ, రామారావు, మౌనిక, వందన తదితరులు జనరల్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, గైనిక్ సమస్యలకు వైద్య పరీక్షలు చేసి 200 మందికి ఉచితంగా మందులు అందజేసారు. హాస్పిటల్ సీఈవో గూడా విజయరాజు, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న మొక్కల ఎగుమతులు



కడియం నర్సరీల నుంచి మొక్కలు ఎగుమతి చేస్తున్న కూలీలు

కడియం: ఇతర రాష్ట్రాల్లో వర్షాలు పడుతుండడంతో కడియం ప్రాంత నర్సరీల నుంచి మొక్కల ఎగుమతులు జోరందుకున్నాయి. మొక్కల కొనుగోలుదారులు, రైతులు ఇక్కడి నర్సరీలకు తరలివస్తున్నారు. దీంతో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు మొక్కల ఎగుమతులు విస్తృతంగా సాగుతున్నాయి. రోజుకు 200కు పైగా లారీల్లో అవెన్యూ, ఆర్నమెంట్, ఫ్రూట్ వెరైటీ మొక్కల ఎగుమతులు జరుగుతున్నాయని స్థానిక నర్సరీ రైతులు తెలిపారు. ఎగుమతుల సీజన్ ప్రారంభం కావడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో కడియం మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాక, చుట్టుపక్కల మండలాల నుంచి సైతం ఎగుమతి కూలీలు ఇక్కడికి చేరుకుంటున్నారు. మండలంలోని కడియపులంక కేంద్రగా ఉదయం మొక్కల ఎగుమతులకు వాహనాలు బయలుదేరుతాయి. దీంతో ఉదయం కడియపులంక జాతీయ రహదారి వెంబడి రద్దీ ఏర్పడుతోంది.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులకు అవకాశం కల్పించినట్టు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తారన్నారు. అలాగే 90,001 ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు అభ్యర్థులు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



నిడదవోలులో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

నిడదవోలు: రవాణా వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ ప్రక్రియను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఆటో ఓనర్స్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. రవాణా వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ ప్రైవేటీకరణను ఉపసంహరించాలని కోరుతూ జిల్లా అఖిలపక్ష ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు సంఘాల ఆధ్వర్యంలో జులై 1న చేపట్టనున్న చలో రాజానగరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేయాలని రవాణా వాహనాల కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు జువ్వల రాంబాబు, ప్రసాద్, ఎల్లే కృష్ణంరాజు, సత్తుల రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత సభ్యత్వ నమోదు వేగవంతం

గోపాలపురం: మండల మానవత సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. స్థానిక శర్వాణి హైస్కూల్లో ఆదివారం మండల మానవత అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు సేవలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. గోపాలపురం పెద్దగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న బత్తుల రాంబాబుకు గోపాలపురం ప్రముఖ వైద్యుడు బొమ్మరెడ్డి గంగాధరరెడ్డి(సుబ్బారెడ్డి) రూ.3వేలు అందజేశారు. రాజంపాలెంలో రూ.15వేల విలువ చేసే సిమెంట్ బల్లలను ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు ఫణికిషోర్ తెలిపారు. ఈకార్యక్రమంలో మానవత కన్వీనర్ నెల్లి చంద్రశేఖర్, సభ్యులు రాధాకృష్ణ సభ్యులు పాల్గొన్నారు.

బురదమయంగా రహదారి



అధ్వానంగా చంద్రవరం- వాడపల్లి ప్రధాన రోడ్డు

చాగల్లు: చంద్రవరం– వాడపల్లి ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షమొస్తే చాలు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు స్థానిక ప్రజలు, రైతులు నరకయాతన అనుభవిస్తున్నారు. బూసి కాలువ వంతెన వద్ద రోడ్డు గోతులతో మరింత ప్రమాదకరంగా తయారైంది. భారీ టిప్పర్లు ఇసుక రవాణా చేయడంతో రోడ్లు పాడవుతున్నాయి. అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని చంద్రవరం ప్రజలు కోరుతున్నారు.

శ్రీనివాస్‌నాయుడి పరామర్శ



కలవచర్లలో రామలింగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: కలవచర్ల వైఎస్సార్ సీపీ నాయకులు వీరమనేని రామలింగేశ్వరరావు కుమారుడు శ్రీనివాస్ ఇటీవల ఆకస్మికంగా మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు ఆదివారం పరామర్శించారు. శ్రీనివాస్ చిత్రపటానికి శ్రీనివాస్‌నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బోనేపల్లి సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, నాయకులు వీరమనేని సుబ్బరావు, నీలాద్రి, మద్దాల ప్రభు పాల్గొన్నారు.

రేపు సీఎం పర్యటన



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి గ్రామంలో మంగళవారం జరిగే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అనంతరం ప్రజావేదిక గ్రామసభలో సీఎం పాల్గొంటారన్నారు. సీఎం రాక నేపథ్యంలో మలకపల్లిలోని పలు ప్రాంతాల్లో ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఆర్డీఓ రాణి సుస్మితతో కలసి కలెక్టర్ ఆదివారం పర్యటించారు. పింఛన్ లబ్ధిదారుల ఇళ్లను, కాపవరం సమీపాన హెలిప్యాడ్ వంటి వాటిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో కొవ్వూరు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఎస్పీ జి.దేవకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఎంపీడీఓ వేణుగోపాల్, తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, ఏఎంసీ చైర్మన్ నాదేళ్ల శ్రీరామ్, ద్విసభ్య కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ ప్రశాంతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితుల రీత్యా సీఎం పర్యటన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు.

అదనపు లోడు చార్జీలపై 50 శాతం రాయితీ

గోపాలపురం: అదనపు లోడు చార్జీలపై విద్యుత్ వినియోగదారులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ఇప్పటికే వినియోగదారులకు తెలియజేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.